# పగ

కరణం రాఘవరావు పరిస్థితి రేపో మాపో అన్నట్లుంది. కనుగుడ్లు ఎక్కడో లోయలో ఉన్నట్లున్నాయి. గడ్డం పెరిగింది. మనిషి పూర్తిగా నీరసించి కట్టెలామారాడు. గత పదిహేను రోజులుగా ఆయన మంచం మీదనే ఉన్నాడు. మల మూత్రాలు కూడా అక్కడే. దాంతో అక్కడ ఒక విధమైన దుర్వాసన నిండిపోయింది. మలమూత్రాలు ఎత్తేయడానికి, ఆయనకు అప్పుడప్పుడు జావ నోట్లో పోయడానికి ఓ పనిమనిషిని కుదిర్చారు. తండ్రి మంచమెక్కడంతో తండ్రి బాధ్యతను భుజాన వేసుకున్నాడు కొడుకు శేషగిరిరావు. దొర రాంరెడ్డికి దీటుగా తండ్రిపోషిస్తూ వచ్చిన గ్రామంలోని ఒక వర్గం తన చేతి నుండి జారిపోకుండా చూసుకునే ప్రయత్నంలో ఆయన మునిగి ఉన్నాడు. దీంతో ఆయనకు తండ్రి వద్ద ఓ ఐదు నిమిషాలు కూర్చునే తీరిక కూడా దొరకడం లేదు. ఏదైనా కబ్జాలకు, భూమి పట్టాలకు సంబంధించిన విషయాలు తనకు అర్థం కాకుంటే మాత్రం తండ్రి వద్దకు వెళ్ళి తెలుసుకుంటున్నాడు. భార్య రమణమ్మకు జీతగాళ్ళకు పని పురమాయించడంతోనే సరిపోతున్నది. దానికి తోడు పొలంపనుల్లో జీతగాళ్లు వెనకడుగు వేయకుండా నిఘావేయడం ఆమెకు మరింత కష్టమవుతున్నది. ఏ జీతగాడైనా సరుకులు దొంగతనంగా జారవేస్తాడేమోననే భయం ఆమెను నిరంతరం కలవరానికి గురిచేస్తున్నది.

రాఘవరావు లేవలేని స్థితిలో ఉన్నాడన్న మాటే గాని అతని మెదడును ఓ సమస్య పురుగులా తొలిచేస్తుండడం ఎవరూ గమనించలేదు. ఇది తన చేతుల మీదుగానే జరగాలనే పట్టుదలతో ఉన్నాడాయిన. తాను కాటికి దగ్గరయ్యాడు. తనను మామూలు చావు వరించబోతున్నది. కానీ దొర రాంరెడ్డి ఆ విధంగా చావడానికి వీల్లేదు. దొర మీద కరణం పాములా పగపట్టాడు. ఆ పగ తీర్చుకోకుండానే వెళ్ళిపోతాననే భయం అతన్ని మరింత కృంగదీస్తున్నది. ఊళ్ళో దొరతో కరణంకు ఒక్క క్షణం పడదు. దారిలో ఇద్దరూ ఎదురు పడితే ఒకర్నొకరు ఒక్కక్షణం తీవ్రంగా చూసుకొని ఎవరి దారిన వారు వెళ్లేవారు. ఊరిజనాన్ని చెరిసగం పంచుకున్నారు. దొర 'ఊ'< అంటే ఒక వర్గమంతా పునరాలోచన లేకుండా కరణం వర్గంపై కత్తులుకటార్లతో, గుత్పలతో విరుచుకపడుతుంది. "చూస్తరేందిరా"? అని కరణం కోపంగా అంటే కరణం వర్గం ముందుకే పోతుంది తప్ప వెనక్కి తగ్గదు. ఈ ఇద్దరు చిల్లర దేవుళ్ళ మధ్య జనం రెండు వైపులయ్యారు. ఈ స్థితిలో తాను చచ్చి దొర బతకటం ఏమిటనేది కరణం వ్యథ. తాను పోతూ పోతూ దొరను తన వెంట తీసుకెళ్ళాలనేది ఆయన ఆలోచన. అదెట్లా అనేది అతనికి తట్టడం లేదు. ఈ వ్యథతో ఆయన మరింత కృంగిపోతున్నాడు. అనేక మార్గాలు ఆలోచించాడు. కానీ ఏదీ ఆచరణయోగ్యంగా అనిపించడం లేదు. "ఎవడ్నో ఒకడ్ని

పురమాయిస్తే?" అనుకున్నాడు. కానీ అది విఫలమైతే దొర జాగ్రత్తపడ్తాడు. తానా లేవలేకుండా ఉన్నాడు. అది తెలిసి దొర వర్గం తనపై విరుచుకు పడ్తే తాను నెగ్గలేడు. వంశాంకురం శేషగిరి రావు కూడా ఈ దొమ్మీలో ప్రాణాలు కోల్పోవచ్చు. ఓ పదిమంది అలగాజనం చస్తే చచ్చారుగానీ తన కొడుక్కి అపాయం రాకూడదు. తన కంటిని తన వేలితోనే పొడుచుకునే పరిస్థితి దొరకు కల్పించాలి. ఇలా అనుకునే సరికి కరణం మెదడులో మెరుపులాంటి ఆలోచన ఉదయించింది. కనుగుడ్లను కంటిలో చేపల్లా కదిలించి తన పరిసరాలను చూశాడు. తనకు సేవలు చేసే పనిమనిషి రత్తి కనిపించింది. మెల్లగా చేయెత్తి ఇటురా అన్నట్లు సైగచేశాడు.

రత్తి అక్కడ్నుంచి కదిలింది. దీంతో తన పథకం పకడ్బందీగా జరగడానికి ఏవిధంగా నటించాలనే విషయంపై మనసులోనే ఆయన రిహార్సల్ వేసుకుంటున్నాడు.

గేట్ బయట బైక్ ఆగినట్లనిపించి "ఎవరొచ్చి ఉంటారబ్బా!" అనుకున్నాడు దొర రాంరెడ్డి. ఎస్.ఐ. అయితే కాదు. తాను ఇపుడే మండలానికి వెళ్ళి ఎస్.ఐ.ని కలిసొచ్చాడు. ఊళ్లో బైక్ ఎవరికుందని ఆలోచించాడు. వెంటనే స్ఫురించలేదు. సస్పెన్స్ తట్టుకోలేక "ఒరే! సత్తిగా! ఎవలో సూడు!" అని కేకేసాడు.

సత్తిగాడనే సత్తయ్య గబగబావెళ్ళి గేట్ తీశాడు. శేషగిరిరావు చిన్న గేట్ లోంచి రావడం చూసి సత్తిగాడు బిత్తరపోయాడు. వెంటనే చేతిలో కర్రబిగుసుకుంది. అదే సమయంలో శేషగిరిరావును చూసి దొర వాలు కుర్చీలోంచి లేచి నోరు వెళ్ళబెట్టాడు. వెంటనే తేరుకొని మళ్ళీ కుర్చీలో కూర్చున్నాడు. శేషగిరిరావు దొర వద్దకు వచ్చాడు. ఒక్క క్షణం ఇద్దరి కళ్ళూ కల్సుకున్నాయి. దొరే ముందు తేరుకున్నాడు. 'కూసోండి' అంటూ కుర్చీ చూపించాడు శేషగిరిరావుకు.

"గిట్ల దయగల్గిందేంది?" అడిగాడు దొర. వెంటనే శేషగిరిరావు సమాధానమివ్వలేదు.

"దొరను ఒక్కసారి రమ్మని చెప్పిరా! రమ్మన్నందుకు చిన్నతనం కావద్దని చెప్పు. ఎప్పటికైనా మీ సేవలో బ్రతకాల్సిన వాళ్ళమేనని, తను లేవలేడు కాబట్టి మిమ్మల్ని ఈ విధంగా రప్పించుకోవల్సి వచ్చిందని చెప్పు" అని తండ్రి చెప్పినపుడు మొదట శేషగిరి రావు బిత్తరపోయాడు. ఆ తర్వాత కోపమొచ్చింది. శత్రువు దగ్గరికి వెళ్ళి కాళ్లు పట్టుకోమంటాడేమిటని మహా ఆగ్రహం కలిగింది. "నాకేం బాగనిపిస్తలేద"న్నాడు. "నా చివరి కోరిక ఇదే. చేస్తవా, లేదా? చెప్పు?" అని నిలదీశాడు తండ్రి. సరేనని ఇక్కడికి వచ్చాడు. తండ్రి చెప్పిన మాటలు చెప్పడానికి నామోషి అనిపించింది శేషగిరి రావుకు. ఇక్కడికి వచ్చాక చెప్పకుండా వెళ్ళలేడు. దాంతో గబగబా తండ్రి చెప్పమన్న మాటలన్నీ వల్లెవేశాడు. ఈ తొందరలో కొంత తడబడ్డాడు. దొరకు ఎక్కడలేని ఆశ్చర్యం వేసింది. "ఏందీ?!" అని ఆశ్చర్యం వ్యక్తమవుతుండగా ప్రశ్నించాడు దొర.

"నాయన ఓసారి రమ్మండు" అన్నాడు చివరగా శేషగిరి. అంటూ లేవబోయాడు.

"కూచో, కూచో! చాయ్ తాగిపో" అన్నాడు దొర. శేషగిరి రావు ఇబ్బందిగా మళ్ళీ కూర్చున్నాడు.

దొర ఆజ్ఞకోసం ఎదురుచూడకండా సత్తిగాడు టీ తేవడానికి లోనికెళ్ళాడు.

రాఘవరావు కన్ను మూశాడు. ఏర్పాట్లన్నీ దొర రాంరెడ్డి దగ్గరుండి చూస్తున్నాడు. ఊరిలో ముఖ్యులందరూ రాఘవరావు ఇంటి ముందు చేరారు. రాఘవ రావు మనుషులతో పాటు దొర రాంరెడ్డి మనుషులు కూడా శవయాత్రకు ఏర్పాట్లు చేస్తున్నారు. రాఘవరావు సన్నిహితులందరికీ దొరే కబురు పంపారు. దాదాపు అంతావచ్చినట్లే. శవయాత్ర బయలు దేరింది. రాఘవరావు అంతిమ సంస్కారానికి దొర ముందుండడాన్ని ప్రజలు చాలామంది చోద్యంగా చూస్తున్నారు. రాఘవరావు మరణానికి ఎవరూపెద్దగా దుఃఖపడుతున్న ఛాయలు కనిపించడం లేదు. అదో పండుగలా సాగుతున్నది. ప్యాలాలతో పాటు చిల్లర డబ్బులు శవం మీదుగా గుప్పిస్తుంటే అలగాజనం పోటీపడి ఏరుకుంటున్నారు. ఆ ఏరుకోవడంలో పిల్లలు ఒకర్నొకరు తోసేసుకుంటున్నారు. కిందపడి దుమ్ము కొట్టుకుంటున్నారు. లేచి మళ్ళీ కుస్తీ పడుతున్నారు. ఎట్టకేలకు సాయంత్రానికి శవం ఊరి పొలిమేరలు దాటింది. అప్పటికే అక్కడ చితి పేర్చి ఉంది. శవాన్ని చితిపై ఉంచి పైనుంచి మరిన్ని దుంగలు పేర్చారు. రాఘవరావు కొడుకు శేషగిరిరావు చితికి నిప్పంటించి వెనక్కి తిరిగి చూడకుండా వెళ్ళి దూరంగా చెట్టుకింద కూర్చున్నాడు. రాఘవరావు భార్య రమణమ్మ కొడుకుకు కాస్త దూరంలో కూర్చుంది. ఆమె చుట్టూ కొంతమంది స్త్రీలు కూర్చొని ఉన్నారు. శేషగిరిరావు వద్ద వారి ముఖ్య బంధువులందరూ కూర్చున్నారు.

మసక చీకటి కమ్ముకుంటోంది. చితి మంటలు పెద్దగా లేచాయి. మాడు చిట్లిందంటూ శేషగిరిని, రాఘవరావు భార్య రమణమ్మను అక్కడ్నుంచి స్నానానికి తీసికెళ్ళారు. దొర రాంరెడ్డి చితివద్దనే నించొని మంట నుంచి వేరైన దుంగలను మంటలోకి వేయిస్తున్నాడు. దొర ఆలోచనలో పడ్డాడు. తానూ ఏదో ఒక రోజు ఇక్కడికి చేరుకోవల్సిందే కదా! అని అన్పించి ఒళ్ళు జలదరించింది. ఇది తెలిసీ, తాము కక్షలు కార్పణ్యాలు పెంచుకొని ఒకరిపై ఒకరు కత్తులు దూసుకోవడం విచిత్రమనిపించింది. మంటల్లోకి దుంగలను వేస్తున్న తన అనుచరులను "పిచ్చివాళ్ళు" అని అనుకునే సరికి ఆయనకు నవ్వు వచ్చింది. తనూ, కరణం తమ తమ ప్రాబల్యాల కోసం ఈ పిచ్చివాళ్ళను వాడుకుంటున్నామని అనిపించింది. ఆ పాపం ఊరికే పోతుందా? అనే ప్రశ్న ఉదయించింది. వాళ్ళను పీల్చి పిప్పిచేసిన పాపమే కరణాన్ని దాదాపు ఇరవై రోజులు బాధ పెట్టింది. మనిషి తీసుకొని తీసుకొని చచ్చాడు. ఆ విధమైన చావు ఎవరికీ రాకూడదనుకున్నాడు. తాను కూడా అట్లాగే చస్తానేమోననుకునే సరికి, ఒళ్లు మరోసారి జలదరించింది. కరణం నరకానికి పోతాడా? స్వర్గానికి పోతాడా? అనే సందేహం వచ్చింది.

విషాదం అలుముకోవాల్సిన సమయంలో ఆ సందేహం రావడం తనకే ఆశ్చర్యం వేసింది. నరకానికి పోతానేమోననే భయం వల్లనే కావచ్చు చివరి ఘడియల్లో తనను పిలిపించి "మీ చేతుల మీదుగా అంత్యక్రియలు జరగాలని" కరణం దీనాతిదీనంగా వేడుకొన్నాడు. అంతేకాకుండా తాను ఎందర్నో వేపుకొనితిన్నానని, ఇప్పటికే ఆ పాపఫలితం అనుభవిస్తున్నానని, చావు ద్వారా నరకంలో మరింతగా బాధపడే ఉద్దేశం లేదని చెప్పాడు. అప్పుడు కరణం మాటలకు ఆశ్చర్యం వేసింది తనకు. చావు దగ్గరపడితే ఈ పాపపుణ్యాల భయం కరణాన్ని ఆవహించినట్లే తనను కూడా ఆవహిస్తుందేమో! కరణం చాలా చిత్రమైన కోరిక కోరాడనిపిస్తుంది. "మీతో ఇన్నాళ్ళు అనవసరమైన శత్రుత్వం పెంచుకున్నా, అందుకు నన్ను క్షమించండి! ఏదీ మనసులో ఉంచుకోకుండా నా అంత్యక్రియలు మీ చేతులు మీదుగా జరిపించండి" అని వేడుకున్నాడు కరణం. తాను తలూపాడు. తాను చచ్చి గ్రామానికి కీడు తల పెట్టుదల్చుకోలేదన్నాడు. అదేమిటో ముందు తన కర్థం కాలేదు. మనిద్దరి మధ్యన ఉన్న వైరం వల్ల ఊరు రెండుగా విడిపోయింది. రెండు వర్గాల మధ్య దాడుల్లో చాలామంది బలవన్మరణం చెందారు. ఆ పాపం నన్ను పీడించక మానదు. కనీసం నాచావయినా గ్రామానికి అరిష్టం కాకూడదు." అని కరణం చెప్పాడు. "నా దహన క్రియలు ఊరి పొలిమేరల్లో జరిగితే ఊరికి అరిష్టమని నా జాతకంలో రాసుంది., అందుకని ఊరి పొలిమేరల అవతల అంత్యక్రియలు జరిపించండి. ఇది మీ చేతుల మీదుగా జరగాలి. నా మరణం తర్వాత మీరే గ్రామ పెద్దలు. ఇక ఊరిలో తగాదాలు కొట్లాటలు ఉండవు. పెద్ద మనసుతో ఈ దీనుడి కోర్కె నెరవేర్చండి" అని తనను కరణం ఎంతగా వేడుకుంది గుర్తొచ్చేసరికి తనను వేదాంత ధోరణి ఆవహించింది. చుట్టూ కలియ జూశాడు. తన అనుచరులంతా గుంపులు గుంపులుగా చేరి ఏదో మాట్లాడుకుంటున్నారు. వారందరి మాటలు కలిసి గింగిర్లు తిరుగుతూ గాలి చెవుల్లోకి బలవంతంగా జొరబడుతున్న భ్రాంతి కలుగుతున్నది. చితివైపు చూశాడు. భగభగమండుతూ మంటలు ఆకాశాన్నంటుతున్నట్లున్నాయి. కరణం ఆత్మపైకి వెళ్ళిపోతున్నట్లనిపించింది.

ఆ ఊరిలో కలకలం బయలు దేరింది. గుంపులు గుంపులుగా చేరి ఊరి జనం చర్చించుకుంటున్నారు. అచర్చల్లో ఆందోళన, భయం కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నాయి. ఓ గుంపు ఊరి సర్పంచ్ ఇంటివైపు కదిలింది. ఆయనే ఆ ఊరి దొరకూడా. ఆ గుంపు ఇంటి ఆవరణలోకి ప్రవేశించేసరికి దొర పర్వతరెడ్డి ఆరాం కుర్చీలో కూర్చొని కల్లు తాగుతూ కనిపించాడు. 'ఏందిరా?' అని దొర అడిగేసరికి గుంపులోని ఒకడు అందుకున్నాడు. "దొరా! మన పక్కూరు కరణంను మనూర్ల కాలబెడ్తుండ్రు" అని చెప్పాడు.

"అల్లూర్లె జాగలేదట్నా?" అన్నాడు వ్యంగ్యంగాదొర.

"సచ్చిన గడియ మంచిది కాదట. ఊర్లె కాలేస్తే మంచిది కాదని మనూర్లె కాస్టం బెట్టింగ్రట"

"మనూరికి కీడు కాదట్నా"? అని ప్రశ్నించాడు దొర.

"గందుకనే మీ దగ్గరకొచ్చినం దొరా!" అన్నాడు.

"దీంట్ల నాకు జెప్పేదేందిరా? కాష్టం దగ్గర రాంరెడ్డిగాడుంటే ఆడి తలలేవాలె అక్కడున్నోల్లెవలూ పానాలతో పోవద్దు" హెచ్చరించాడు. ఒక్క క్షణం ఆగకుండా గుంపు వెనుదిరిగింది. ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న అవకాశం లభించినట్టనిపించింది పర్వతరెడ్డికి. తాగి ఉన్నాడాయె. వంకరగా నవ్వాడు. ఆ నవ్వులో పగ తీరుతున్నదనే సంతృప్తి ఉంది.

దగ్గరలో అరుపులు, కేకలు వినిపించేసరికి ఉలిక్కి పడ్డాడు రాంరెడ్డి. వెనక్కి తిరగబోయే సరికి ఓ పెద్ద కర్ర తలపై పడింది - 'మా ఊరిని మట్టిలగల్పడానికి పీనుగును ఈడ గాల్పిస్తావుర' అనే మాట అస్పష్టంగా చెవులను సోకింది. కర్రలతోదండు సమీపించడాన్ని చూసిన దొర అనుచరులు దొరపై దెబ్బపడడాన్ని ఆపలేకపోయారు. దొర అనుచరులైదారుగురు నేలకూలారు. మిగతా వారు పరుగులంకించుకున్నారు. కాళ్ళు చేతులు విరిగిన వాళ్ళు నేలమీద పడి లబలబలాడుతున్నారు. దొర రాంరెడ్డి గిలగిలా కొట్టుకొని ప్రాణాలు విడిచాడు. దొర, దొర అనుచరులు కొందరు కుప్పకూలేసరికి దాడి చేసినవారి ఆగ్రహం చల్లారింది. ఎదురుగా రక్తం మడుగుల్లో శరీరాలను చూసే సరికి ముచ్చెమటలు పట్టాయి. కర్రలు పారేసి పరుగు తీశారు.

పోలీసులు వచ్చేసరికి తెల్లవారింది. దొరపై దాడి చేసినవారెవరూ పోలీసులకు చిక్కలేదు. పరారీలో ఉన్నారు. కనిపిస్తే అప్పగిస్తామని ఆ ఊరి సర్పంచ్, దొర పర్వతరెడ్డి పోలీసులకు హామీ ఇచ్చాడు. తాతలనాటి భూమి తగాదాలకు ప్రతీకారంగా రాంరెడ్డి తల పగలగొట్టించినందుకు దొరకిప్పుడు సంతృప్తిగా వుంది. ఆ ప్రాంతంలో రాజకీయంగా తనకిక అడ్డులేదనే విషయం ఆయనకు మరింత సంతృప్తి నిచ్చింది. తృప్తిగా ఊపిరి పీల్చుకొన్నాడు. ఆ విషయాన్ని పసిగట్టినట్టే పోలీసులు నిందితులను అతనే దాచాడనే విషయం తెలిసికూడా దొరహామీపై సంతుష్టులయ్యారు. తాము చేయాల్సిన తతంగమంతా పూర్తి చేసి దొర శవాన్నీ, మిగతా శవాలను వారి వారి కుటుంబాలకు అప్పగించారు.

దొర రాంరెడ్డి శవం ఇంటి ముందు ఉంది. ఊరు ఊరంతా కదిలి వచ్చింది. దాడికి సంబంధించి ఎవరికి వారు సంభాషణల్లో మునిగిపోయారు. దొర భార్య గోడుగోడున విలపిస్తోంది. డెబ్బయ్ ఏళ్ళ దొర తల్లి లక్ష్మమ్మ దొరసాని తల్లుకుని తల్లుకొని ఏడుస్తోంది.

*(1999లో ప్రచురించిన 'శిలువకు తొడిగిన మొగ్గ' కథల సంపుటి నుంచి....)*